


ఎ.ఎస్.రమేష్

"ఎ...దు...రు లేని మనిషి"-ఓసారి తను అంటించిన పోస్టరుకేసి చూసి చదువుకుని, తృప్తిగా మెట్లు దిగాడు పదేళ్ళ కుర్రాడు శీను. దిగగానే బూట్ల 'టక టక' శబ్దం వినిపించడంతో అటు చూశాడు. రోజూ లయబద్ధంగా ఆ శబ్దం వినిపిస్తే అతని చిన్నారి హృదయం గంతులేస్తుంది. యూనిఫారం బట్టలతో, చక్కని 'టై' కట్టుకుని వెనక ఒక పెద్ద బ్యాగ్‌లో పుస్తకాలు నింపుకుని, ఆ భారానికి తట్టుకోలేక కాస్త వంగుతూ నడిచే తన తోటికుర్రాళ్ళని చూస్తే శీను కళ్ళు తడిసి, మనసు అదోలా ముడుచు కొంటుంది. తను కూడా, తన నాన్నని ఆ దెయ్యం వదిలితే ఎంచక్కా స్కూలు కెళ్ళి చదూకోవచ్చు. కానీ నాకా భాగ్యం నిజంగా ఉందా? లేదు. అందుకే ఇలా మురికి బట్టల్తో సినిమా పోస్టర్లు మోస్తూ ...హు తలచుకుంటే ఏం లాభం? వట్టి బాధ తప్ప?

"ఏయ్ శీనూ...ఏమిట్రా చేస్తు న్నావ్? ఇంకా పది పోస్టర్లున్నాయ్"

రాజయ్య కేకతో ఈ లోకంలో పడిన శీను, ఉలిక్కిపడి "అలాగే వెళ్తాను

రాజయ్యా" అనగలిగాడు-

శీను ఆ పక్క వూళ్ళో తల్లితో, చెల్లితో వుంటున్నాడు. అతని నాన్న అనిపించుకున్నవాడు వట్టి తాగుబోతు. తప్పతాగి ఏ పొద్దుకో రావటం, అమ్మని అన్నం పెట్టమనటం, లేదంటే చావ బాదటం, తూలుకొంటూ, తిట్టుకుంటూ బయటికెళ్ళటం అతని అలవాటు. రోజూ నాన్నచేసే ఆగడాలు విపరీతమవటంతో తను బడి మాని ఇలా "రాజేశ్ పార డైజ్"లో పనికి చేరాడు. డబ్బు కూడ బెట్టి, ఆ డబ్బుతో బళ్ళో చేరగలిగితే తనకంతే చాలు అనుకుంటూ వెళుతు న్నాడు శీను.

నెలకోసారి తనకి రాజయ్య ఇచ్చే జీతం అరవై రూపాయలు. అందులో ఇరవై రూపాయలవరకూ కూరాకు అమ్మే ముసలమ్మ రంగమ్మవద్ద కూడ బెడుతున్నాడు శీను. రంగమ్మ ఆ వూళ్లో ఓ పూరిగుడిసెలో వుంటుంది. రంగమ్మ శీనూకి దూరపు చుట్టం అవుతుంది.

ఇప్పటికి అయిదునెలలు గడిచాయి. వంద రూపాయలు అమ్మకి పంపితే ఇంకో వంద రంగమ్మ దగ్గిర ఉంచాడు. ఆ వందతో తను స్కూళ్ళో చేరి, చెల్లాయికో మంచి లంగా కొనివ్వాలని శీను ఆశ. ఆ రోజు సెకండ్ షో అవగానే రంగమ్మ గుడిసె కెళ్ళాడు.

ఆ రోజుతో అతని ఆశ ఫలించేట్టుగా ఉంది. సినిమావద్ద అందుకే రంగమ్మ తను మరో ఊరెళ్ళ నున్నాననీ, డబ్బు పూర్తిగా తీసుకోమనీ తెలిపింది.

ఆ గుడిశెలో ఒకే ఒక చిన్నదీపం వెలుగుతోంది. రంగమ్మ ఆ మసక వెలు తురులో మంచంపై పడుకొని ఆయాస పడుతోంది.

"అవ్వా!" పిలిచాడు శీను ఆత్రుతగా.

"వచ్చావా శీను! రా! కాస్త మంచి నీళ్ళివ్వు బాబూ" గొంతు తడారుతుంటే అంది రంగమ్మ పొడి పొడిగా దగ్గుతూ.

శీను అక్కడే ఉన్న కుండలోంచి మంచినీళ్ళు తీసి అందించాడు. రంగమ్మ తృప్తిగా నీళ్ళు త్రాగి, కళ్ళు మూతపడు తూంటే, "శీనూ, నీ డబ్బు ఆ ఎర్ర డబ్బాలో వుంది. ఆ కుర్చీ వేసుకుని ఎత్తుకో బా...బూ..." అంటూనే కళ్ళు మూసింది. రంగమ్మ ప్రాణపక్షి విశాల గగనంలోకి రివ్వున ఎగిరిపోయింది.

శీను కుర్చీ ఎత్తుకున్నవాడల్లా, రంగమ్మ ఊపిరి వినిపించకపోవటంతో భయంగా కుర్చీ వదలి, "రంగమ్మవ్వా!" అంటూ బిగ్గరగా అరిచాడు. అతని అరుపు లకి పక్కనున్న గుడిసెలవారు పోగ య్యారు. శీను బాగా జనం గుమిగూడ్డంతో భయపడిపోయాడు. డబ్బు సంగతి ఆ భయంవల్ల అతణ్ణి తాత్కాలికంగా వదిలి పోయింది. భయం భయంగా కళ్ళుపెద్దవి చేసుకుని చూస్తున్నాడు. ఇంతలో ఎవరు తెలిపారో పోలీసులు రంగంలోకి దిగి, రంగమ్మ ఇంటిని ఆమె అనాథ

రావటంతో సోదాచేయ నారంభించారు. వారి ఉద్దేశం శవసంస్కారానికి డబ్బు వుందేమో చూడటం. ఎందుకంటే, కూర అమ్మి ఏదైనా డబ్బు కూడబెట్టుకుం దేమో ముసలిది. అది ఆమె దహనానికి వాడితే సరి.

లాఠీతో గుడిసెలోని డబ్బాలన్నీ తోస్తూంటే అప్పుడు శీనుకి తన డబ్బు సంగతి గుర్తొచ్చింది పాపం! అదే 'ఎర్ర డబ్బా...' అనుకున్నాడు పైన ఉన్న డబ్బాకేసి.

సరిగ్గా అప్పుడే ఆ ఎర్రడబ్బాని క్రిందికి తోశాడు పోలీసు. డబ్బు చిల్లర కాసులతో సహా క్రింద చెల్లాచెదురుగా పడితే మూగగా, భయంభయంగా ఏడుస్తూ చూస్తున్నాడు శీను. ఆ డబ్బు ఏంచు కుంటూ, "గట్టి ముసల్ది" అనుకుంటూ నవ్వుతూంటే అతణ్ణి చూస్తూ గట్టిగా ఏడ్వటం తప్ప, మరేమీ చేయలేక పోయాడు శీను.

"ఎందుకేడుస్తావ్ బాబూ. మీ అవ్వ ఇకరాదు. రంగమ్మకి నీదంటే ఇష్టం! పాపం! అప్పుడప్పుడూ వచ్చేవాడు."

"ఇంకా చిన్నపిల్లాడు! అతనికేం తెలుస్తుంది?" తలో రకంగా అంటూంటే ఎవ్వరూ డబ్బు, తన డబ్బు గురించి చెప్పకపోవటంతో అతని ఏడుపు రెట్టింపయింది.

ఇంతలో ఆశ్చర్యం కలిగించే వింత ఒకటి జరిగింది. చనిపోయిందనుకున్న రంగమ్మ సన్నగా మూలిగింది. అందరి కళ్ళూ అటువైపు తిరిగాయి.

"శీ...ను... నీ... డ...బ్బు... ఎ...ర్ర...డ...బ్బా...లో ఉంది–" అప్రయత్నంగా ఆమె మాట్లాడుతూంటే అందరూ జాగ్రత్తగా విన్నారు. "ఇదేం చిత్రంరా బాబూ!" అనుకున్నారు.

ఓ పోలీసు ఇందులో ఏదో ఉందను కుని, ఆ డబ్బున్న డబ్బాని చేతిలో తీసుకొని, రంగమ్మ ఎదుట నిల్చొని 'శీనూ' అన్నారు.

శీను ఒక్క ఉదుటున రంగమ్మ వద్దకెళ్ళి "అవ్వా! అవ్వా!" అంటు న్నాడు. అతని కళ్ళు మెరుస్తూంటే 'నేనే శీనూ' అనగలిగాడు పోలీసుని చూస్తూ. పోలీసు 'అవునా?' అన్నట్లు రంగమ్మ కేసి చూశాడు. అవునన్నట్టు రంగమ్మ తల ఆడించింది. శీనూని తల నిమిరింది.

ఆ డబ్బాని పోలీసునుంచి తీసుకుని, శీనూకి అందించింది. ఆ తర్వాత పడు కున్న రంగమ్మ మళ్ళీ లేవలేదు. ఈ సారి ఆమె శాశ్వతంగా కన్ను మూసింది.

శీను కళ్ళు తన కష్టఫలం దొరికిం దన్న సంతోషంతో మెరవటంతో పాటు అవ్వ మళ్ళీ రాదన్న ఊహతో వర్షిం చాయి.

అతని కళ్ళముందు తను కూడా హాస్టల్ చేరి, ఆ పిల్లల వెనకాల... తెల్లటి బట్టల్తో,... బూట్లు టకటక లాడించుకొంటూ... స్కూలుకెళ్ళే దృశ్యాలు కదిలి ఒక్కసారిగా మాయ మయ్యాయి.